క్లుప్తంగా

వేలంలో రూ.11.03 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న ఆలయాధికారులు

సంజామల: ఆకుమల్ల గ్రామంలోని చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూముల కౌలు వేలం ద్వారా రూ.11.03 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ చెన్నయ్య తెలిపారు. శనివారం ఆలయానికి చెందిన 54.71 ఎకరాల భూమికి వేలం నిర్వహించామన్నారు. గతంలో రూ.11 లక్షలు రాగా ఈ ఏడాది అదనంగా రూ.3 వేలు వచ్చినట్లు ఈఓ చెప్పారు. మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: పట్టణ సమీపంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం అవుకు మండలం గుండ్ల శింగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పసుపల రత్నమయ్య కుమారుడు చంద్రబాబు వివాహం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థి ప్రతిభ


అక్బర్ బాబు

డోన్ టౌన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థి అక్బర్‌బాబు సీఈసీ గ్రూపులో 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతిభ కలిగిన అధ్యాపకులు ఉన్నారని.. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రైవేట్‌కు దీటుగా వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రవేశాలకు దరఖాస్తులు ఇస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న తిరుపాల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి

సంజామల: మండల పరిధిలోని నిచ్చెనమెట్ల గ్రామంలో ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. రామాలయం, ఆంజనేయస్వామి, అంకాలమ్మ ఆలయ నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, చెన్నప్ప, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, శివరాముడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


వీరారెడ్డిని పరామర్శిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పెద్దవెంతుర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వీరారెడ్డిని శనివారం సాయంత్రం జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకుంటూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే బెంగళూరులో చికిత్స పొంది ఇంటికి వచ్చిన శివారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు రామసుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, తిరుపంరెడ్డి, కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

కేవీలో ప్రవేశాలు కల్పించాలని వినతి

డోన్ టౌన్: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు శివన్న, విజయభాస్కర్ కోరారు. శనివారం డోన్ పర్యటనకు వచ్చిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్రీయ విద్యాలయం ప్రారంభించడానికి అన్ని వసతులు ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో డోన్‌కు కేంద్రీయ విద్యాలయం అందని ద్రాక్షలా మారిందన్నారు.

కోన వేంకటేశ్వరుడికి పూజలు

సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోన వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు చేశారు.


కోవెలకుంట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు.


కోవెలకుంట్ల: పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తున్న మత పెద్ద


కొలిమిగుండ్లలో..


ఆకుమల్ల గ్రామంలో..

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు
- పండుగ విశిష్టతను వివరించిన మత పెద్దలు
- పేదలకు ఖుర్బానీ పంపిణీ


బనగానపల్లెలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


ప్యాపిలి: దువా చేస్తున్న ముస్లింలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇబ్రహీం, ఇస్మాయిల్ జబీవుల్లా త్యాగాలను స్మరించుకుంటూ ఏటా జిల్‌హాజ్ నెల 10వ రోజు వారి త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఈదుల్ అజ్‌హాను పురస్కరించుకుని కోవెలకుంట్ల పంచాయతీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన ముస్లింలు పట్టణ శివారులోని ఈద్గాకు చేరుకుని ఈదుల్ జుహా నమాజ్ చేశారు. అలాగే బిజనవేముల, చిన్నకొప్పెర్ల, సొదరదిన్నె, రేవనూరు, కలుగొట్ల, జోళదరాశి, గుళ్లదూర్తి, కంపమల్ల, భీమునిపాడు గ్రామాల్లోని మసీదుల్లో దువా చేశారు. అనంతరం పేదలకు తమ వంతు ఆర్థికసాయం అందజేసి భక్తిభావాన్ని చాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట, హనుమంతుగుండం, చింతలాయిపల్లె, తుమ్మలపెంట తదితర గ్రామాల్లోని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. త్యాగం, సేవ, సమానత్వానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకుంటారని మతగురువులు పేర్కొన్నారు.

- **సంజామల:** మండలంలో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు.
- **బనగానపల్లె రూరల్:** పట్టణంలో ఉదయం నుంచి వర్షం కురవడంతో స్థానిక ఈద్గాలో నిర్వహించాల్సిన నమాజ్ కార్యక్రమం ఆయా కాలనీల్లో ఉన్న మసీదుల్లో జరిగాయి. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- **బేతంచెర్ల:** మండలంలోని సిమెంట్‌నగర్, గూటుపల్లె, ఆర్ఎస్ రంగాపురం, ఎం పేండెకల్లు, బలపాలపల్లె, హుస్సేనాపురం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రార్థనలు జరిగాయి. పట్టణంలోని ముస్లింలు కొలుములపల్లె రహదారిలోని ఈద్గాలో ప్రార్థనలు చేశారు. ఇతరులపై ప్రేమ, దయ, దాన గుణం కలిగి ఉండాలని.. అల్లా చూపిన సన్మార్గంలో నడవాలని మండల ఖాజీ నూర్‌అహ్మద్ పేర్కొన్నారు.
- **ప్యాపిలి:** మండల కేంద్రంతో పాటు రాచర్ల, జలదుర్గం, చిన్నపొదిళ్ల, పోతుదొడ్డి, మెట్టుపల్లి, ఏనుగుమర్రి, కొమ్మేమర్రి గ్రామాల్లో ముస్లింలు శనివారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో ప్రభుత్వ ఖాజీ, హఫీజ్ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఉదయాన్నే ఈద్గాకు చేరుకున్నారు. సామూహిక ప్రార్థనలు చేశారు. బక్రీద్ సందేశాన్ని వివరించారు. ధనవంతులు తప్పనిసరిగా ఖుర్బాని మాంసాన్ని పేదలకు పంచాలన్నారు.
- **డోన్ టౌన్:** పట్టణ సమీపంలోని ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమకు తోచిన రీతిలో పేదలకు ఆర్థిక సహాయం చేశారు.


బేతంచెర్ల: ప్రసంగిస్తున్న మండల ఖాజీ


బేతంచెర్ల: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


డోన్: బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న మతపెద్ద


డోన్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలని బనగాపల్లె మండలం యాగంటి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, రమణయ్య రైతులకు సూచించారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా చేపట్టిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం మండలంలోని జోళదరాశి, కలుగొట్ల, రేవనూరు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామసభల్లో వారు మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వివిధ పంటల సాగుకు సంబంధించి భూసార పరీక్షల ఆధారంగా తగిన మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాలన్నారు. విస్తారంగా సాగు చేసే మొక్కజొన్న, కంది, వరి, సోయాబీన్, కంది, మినుము, తదితర పంటల సాగులో వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, తెగుళ్ల, పురుగుమందులు, తదితర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మారిన ఆధునిక వ్యవసాయ రంగానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం తయారీ విధానం, వ్యవసాయ శాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిరంజన్, నంద్యాల ఏఓ ప్రభావతమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలేటయ్య క్షేత్రం కిటకిట


ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహ స్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు చర్యలు చేపట్టారు.


ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: బైక్‌ను కారు ఢీకొనడంతో తాత మనవరాలు గాయపడిన ఘటన డోన్ సమీపంలోని యు.కొత్తపల్లె వద్ద శనివారం జరిగింది. మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన పేట పెద్దయ్య తన మనవరాలితో బైక్‌పై వెళ్తున్నాడు. యు.కొత్తపల్లె–ఉంగరానిగుండ్ల మధ్యలోని జాతీయ రహదారిపై హిందూపురం నుంచి కర్నూలుకు వెళుతున్న కారు ఢీకొనడంతో పెద్దయ్యకు తీవ్ర గాయాలు కాగా మనవరాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బైపాస్ రోడ్డు నిర్మాణంపై అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు నిర్మాణంతో బనగానపల్లె రూపురేఖలు మారుతాయని, రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల బకాయిలను సకాలంలో చెల్లించేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. బత్తులూరుపాడు, బనగానపల్లె గ్రామాలకు చెందిన రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే మట్టి తవ్వరాదు

పాణ్యం: అనుమతులు లేనిదే మట్టి తవ్వరాదని మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు సూచించారు. పిన్నాపురం రస్తాలో ఉన్న ఓబులమ్మ కుంటలో మట్టి తవ్వుతున్న జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన శనివారం తెలిపారు. ఓబులమ్మ కుంట దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. రైతులకు మట్టి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామన్నారు. అనుమతులు లేకుండా కుంటలో మట్టిని తవ్వితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైళ్లను పునరుద్ధరించాలి


సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఐ నాయకులు

డోన్: కరోనా సమయంలో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో రద్దు చేసిన పలు రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమ్మ హోటల్ జంక్షన్ వద్ద రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ చేపట్టిన సంతకాల సేకరణకు వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ.. ధనవంతులు తిరిగే ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతూ, పేదలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేడపతామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్డీ రమణ, సాదిక్, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, నాయకులు పెయింటర్ మాబు, రైల్వే రమణ తదితరులు పాల్గొన్నారు.


పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి

కొలిమిగుండ్ల: కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం నుంచి ఎండ వేడిమి అధికంగా ఉండడంతో జనం అల్లాడుతున్నారు. ఏప్రిల్ చివరి నుంచి ఎండలు తగ్గుముఖం పట్టి మే మాసం వచ్చే సరికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి వర్షాలు కురవడంతో ఎండలు తగ్గుముఖం పట్టాయి. అయితే కొద్ది రోజుల నుంచి ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలు తదితర చోట్ల ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం మళ్లీ పెరిగింది. కాగా మండలంలో ఏప్రిల్ 28న ఊహించని రీతిలో 48 మి.మీ వర్షపాతం నమోదైంది. మేలో కూడా మోస్తరుగా వర్షాలు పడ్డాయి. ఈ ఏడాది బాగా వర్షాలు కురుస్తాయని రైతులు ఆశలు పెంచుకున్నారు. ఇప్పటికీ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండడంతో ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోంది. వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. భారీ వర్షం కోసం అన్నదాత ఎదురుచూస్తున్నాడు.

అరుగు నుంచి పడి వ్యక్తి మృతి

బేతంచెర్ల: పట్టణంలో ఓ వ్యక్తి అరుగుపై నుంచి పడి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కుమ్మరి వెంకటేశ్వర్లు(30) నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న స్వామిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఉన్న అరుగుపై పడుకున్నాడు. ప్రమాదవశాత్తు అరుగుపై నుంచి బోర్లాపడి గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. శనివారం ఉదయం కొన ఊపిరితో ఉన్న అతన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

టీచర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు


మాట్లాడుతున్న యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

బనగానపల్లెరూరల్: ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీల్లో మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించడం తగదన్నారు. వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తే వ్యతిరేకించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్, జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి, విజయ కుమార్, సతీష్, గోపాల్, మల్లికార్జున, మనోహర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటి పాఠశాలలు.. నేటి 'మోడల్' స్కూళ్లు

- పంచాయతీకి ఒక పాఠశాల ఏర్పాటు
- హెచ్‌ఎంతో పాటు నలుగురు ఉపాధ్యాయులు


గతంలో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాల

కొలిమిగుండ్ల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు కల్పించింది. నాడు-నేడు పథకంతో కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చివేసింది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని సమకూర్చింది. తరగతి గదుల ఆధునీకరణ, పెయింటింగ్, విద్యుత్, తాగునీరు, ఫ్యాన్లు, టాయిలెట్లు, బెంచీలు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో పాఠశాలలను విభాగాలుగా ఏర్పాటు చేసింది. ఇందులో పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ చొప్పున ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల మండలంలో పది పాఠశాలలను ఎంపిక చేశారు. కొలిమిగుండ్ల మెయిన్ ప్రాథమిక పాఠశాల, బెలుం, చింతలాయిపల్లె, తుమ్మలపెంట, బందార్లపల్లె, తిమ్మనాయినపేట, కోటపాడు తదితర పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద అందంగా తీర్చిదిద్దిన పాఠశాలలనే మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చు చేశారని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా హెచ్‌ఎంతో పాటు నలుగురు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎంల నియామక ప్రక్రియ పూర్తయింది. మండలంలో దాదాపు అన్ని పాఠశాలలకు హెచ్‌ఎంలు వచ్చారు. కొత్తగా ఏర్పాటైన ఆదర్శ పాఠశాలల్లో ఎంత మేర విద్యార్థుల సంఖ్య పెరుగుతుందో వేచి చూడాలి.

పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

బేతంచెర్ల: సిమెంట్‌నగర్ గ్రామంలోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు.